ఆటో డ్రైవర్స్ కు పిఎఫ్, ఈఎస్ఐ తో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు

విశాలాంధ్ర-అనకాపల్లి: ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ తో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మేరకు తక్షణమే వాహన మిత్రులను 15వేలు రూపాయలు ఇవ్వాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఎన్నికల్లో తమ అధికారంలోకి వస్తే 15000 వాహన మిత్ర ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వాహన మిత్ర ఎందుకు విడుదల చేయలేదని దొరబాబు ప్రశ్నించారు. పోలీసులు ప్రైవేటు ఫైనాన్సు సంస్థలు వేధింపులు కూడా ఆటోరంగం కార్మికుల పైన తీవ్రంగా ఉందన్నారు ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్స్ మంజూరు చేసే అనుమతులను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వద్దని దొరబాబు అన్నారు ప్రభుత్వమే డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికెట్ లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చేసారు. ప్రమాదాల నియంత్రణ పేరుతో తీసుకువచ్చిన 2023 నూతన మోటార్ యాక్ట్ లో సెక్షన్ 116 (1),(2)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి జీవన ఆధారం లేకపోవడం వల్ల ఆటో రంగా నమ్ముకుని జీవిస్తున్న డ్రైవర్లకు ప్రభుత్వం అండగా నిలవక పోగా కఠినమైన చట్టాలు తీసుకొచ్చి మోటార్ డ్రైవర్స్ ఉరితాళ్ళు బిగిస్తున్నారని ఆవేదన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వి. రాజు, సన్నిబాబు,దొండ అప్పారావు, జి అప్పారావు, జె.మహేష్, గిరి, పోతురాజు,ఆటో డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఓమ్మివానిపాలెంలో రేషన్ డిపో ప్రారంభం

విశాలాంధ్ర-సబ్బవరం: పెందుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సహకారంతో మండలంలోని అంతకాపల్లి పంచాయతీ శివారు ఓమ్మివానిపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన రేషన్ సబ్ డిపో ను లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ అధినేత చొక్కాకుల వెంకటరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి,ఎంపీటీసీ చొక్కాకుల గోవింద్, మండలం జనసేన పార్టీ అధ్యక్షులు కర్రి కనకరాజు ,మాజీ జడ్పీటీసీ రోంగాలి దేముడు బాబు, మాజీ టిడిపి పార్టీ అధ్యక్షుడు మిడతడ మహాలక్ష్మి నాయుడు, జనసేన నాయకులు పల్లా రమణ, సబ్బవరపు రమణ, నరసింహమూర్తి, సబ్బవరపు గాంధీ, సబ్బవరపు నాయుడు, బోకం శ్రీను, ఒమ్మి కోటి బాబు, కె.మోహన్ కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

సబ్బవరం శ్రీ దుర్గాంబ పిఎసిఎస్ కు బెస్ట్ సొసైటీ అవార్డు.

విశాలాంధ్ర-సబ్బవరం: ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు స్థాపించి 62 సంవత్సరాలు పూర్తి కావడంతో ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో బెస్ట్ సొసైటీలను ఎంపిక చేయడంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో సబ్బవరం శ్రీ దుర్గాంబ పిఎసిఎస్ ను బెస్ట్ సొసైటీ గా 2023-24 సంవత్సరం నకు గాను ఎంపిక చేసినట్లు పిఎసిఎస్ సీఈవో గొంప రమణ తెలిపారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన ఈ బెస్ట్ సొసైటీ అవార్డుల కార్యక్రమంలో రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా సోమవారం బెస్ట్ సొసైటీ అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు.

అర్జీల సమాచారాలకై అర్జీదారులు 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చు

పిజిఆర్.ఎస్.కు 284 అర్జీలు : కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్: ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో వచ్చిన అర్జీలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీలను పరిష్కరించాల జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పరిస్కారం కాని అర్జీల పై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని ఆమె తెలిపారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని అర్జీల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించ వచ్చని తెలిపారు. పి జి ఆర్ ఎస్ అర్జీలు జిల్లా అధికారి లాగిన్ లో ఉంటే జిల్లా అధికారి మండల అధికారి లాగిన్ లో ఉంటే మండల అధికారి నేరుగా క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లి, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని అధికారులను సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి నిర్ణిత సమయంలో చర్యలు తీసుకోవాలన్నారు, అర్జీదారులు తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ అర్జీదారులకు సూచించారు. ఈ రోజు పి.జి.అర్.ఎస్. లో 284 అర్జీలు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కె అర్ ఆర్ సి , పి జి ఆర్ ఎస్ ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్ సుబ్బలక్ష్మి, రామ మని, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా గృహనిర్మాణ శల,జిల్లా గ్రామీణ అభివృద్ధి, డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస్, శచిదేవి, పూర్ణిమ దేవి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణ మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. హైమావతి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుదీర, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో సొసైటీని తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే బండారు.

విశాలాంధ్ర-కె.కోటపాడు: పిఎసిఎస్ ను లాభాల బాటలో నడిపించేందుకు కృషిచేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు .సోమవారం ఇక్కడి ఎస్.అర్.ఫంక్షన్ హాల్లో కె.కోటపాడు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది.చైర్ పర్సన్ గా టీడీపీ సీనియర్ నాయకులు, కొరువాడ మాజీ ఎంపీటీసీ సభ్యులు చీపురుపల్లి రామారావు,డైరెక్టర్లుగా రుద్ర ఈశ్వరరావు, దొగ్గ వెంకటరావులచే ప్రమాణం చేయిం చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ.. కార్యకర్తల అభీష్టం మేరకే రామారావు చైర్మన్ గా నియమితులయ్యారన్నారు.ఎలాంటి మచ్చలేకుండా సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని కమిటీకి సూచించారు. సంఘ సభ్యులకు ఇచ్చే ప్రతి పైసా ఆచీతూచీ ఇవ్వాలని, నిజాయితీగా నిర్మోహమాటంగా పనిచేయాల న్నారు. ఆరు నెలల తర్వాత సొసైటీ పాలకవర్గానికి ఎన్నికలు జరుగుతాయని, ఆ ఎన్నికల్లో కూడా మళ్ళీ మీరే గెలిచేలా కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర కొప్పుల వేలమ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పదవికి వన్నెతెచ్చేలా పనిచేయాలని ఆకాంక్షిం చారు. చైర్ పర్సన్ రామారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. తమకీ అవకాశం ఇచ్చిన పార్టీకి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు . అంతకు ముందు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏర్పాటుచేసిన ఫామ్ బజార్ (వెజిటేబుల్స్ అండ్ ఫ్రూట్స్ మొబైల్ వెహికల్) ను ఎమ్మెల్యే ప్రారంభించారు. డి అగ్రహారం గ్రామానికి చెందిన గణేష్ గ్రూప్ సభ్యురాలు వేచలపు సత్యవతికి ఈ వెహికల్ ను అందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ, ఏపీసీఎంఎఫ్ డిపిఎం లచ్చన్న ఎంపీడీవో సాంబశివరావు టీడీపీ సీనియర్ నాయకులు కశిరెడ్డి అప్పలనాయుడు, సబ్బవరపు రామునాయుడు, క్లస్టర్ ఇంచార్జీలు కన్నూరు సూర్యనారాయణ, వెలగల పైడంనాయుడు , జూరెడ్డి రాము బొద్దు అక్కునాయుడు,దాడి ఎరుకునాయుడు, లెక్కల అవతారమూర్తి, కే కోటపాడు సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-పాయకరావుపేట: రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సహకరించాలని సీఐ జి. అప్పన్న తెలిపారు. శ్రీ ప్రకాష్ లో విద్యార్థులకు, డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. నియమాలు పాటించడం వలన రోడ్డు ప్రమాదాలు నివారించి, ప్రజల ప్రాణాలను కాపాడిన వారవుతారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించటం వలన ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉంటుందని తెలిపారు. అతివేగం ప్రమాదకరమని, బైక్ లపై వెళు తున్నప్పుడు హెల్మెట్, 4 వీలర్స్ పై వెళుతున్నప్పుడు సీట్ బెల్ట్ నియమాలు తప్పక పాటించాలని అప్పన్న తెలిపారు.

కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూమిని కాపాడండి

అధికారులకు సర్పంచ్ సుజాత ముత్యాలు వినతి

విశాలాంధ్ర-పరవాడ: పరవాడ మండలం వాడచీపురుపల్లి తూర్పు రెవెన్యూ సర్వే నెంబర్ 205లో గల ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని, తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముత్యాలంపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసిల్దారు నాగరాజుకు, జిల్లా కలెక్టరుకు వినత పత్రం అందజేశారు. పక్కనే ఉన్న కొంత నిరాయితీ భూమిలో ప్రభుత్వ భూమిని కలిపి లేఔట్ వేయడమే కాకుండా ఆ లే ఔట్ కు రహదారి కోసం అడ్డుగా ఉన్నాయన్న నెపంతో ప్రభుత్వ భూమిలోని ఏళ్ల కాలం నాటి విలువైన తాడి, జీడి చెట్లను సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు తొలగించారని అధికారులకు వివరించారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అడ్డుగా ఉన్న చెట్లను సైతం ధ్వంసం చేసిన అక్రమార్కులపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలని వినతి పత్రం ద్వారా అధికారులను సుజాత ముత్యాలు కోరారు.

జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మోసా అప్పలరాజు నియామకం

విశాలాంధ్ర-పాయకరావుపేట: జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా మండలంలోని కొర్లయ్య పేట గ్రామానికి చెందిన మోసా అప్పలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ మత్స్యకార సంఘం సెక్రటరీ జనరల్ అనంత నగేష్ బాబు నుండి నియామక పత్రం అందుకున్నారు. మోసా అప్పలరాజు రాష్ట్ర అధ్యక్షులుగా నియామకం జరగటం ఇది రెండవసారి. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి, జాతీయ మత్స్యకార సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి కల్పించిన సంఘం సెక్రటరీ జనరల్ అనంత నగేష్ బాబుకు, ఆల్ ఇండియా చైర్మన్ నందకుమార్ కు, ఆల్ ఇండియా వర్కింగ్ చైర్మన్ ప్రభాకరన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పాయకరావుపేట : మండలంలోని కుమారపురం గ్రామానికి చెందిన చుక్కా గోపాల్ రెడ్డి(48) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జొమాటోలో డెలివరీ బాయ్ గా పనిచేస్తున్న గోపాల్ రెడ్డి ఆదివారం పనిముగించుకుని మోటార్ సైకిల్ పై ఇంటికి వస్తుండగా తుని వీరవరపుపేట వద్ద కుక్క అడ్డు రావడంతో మోటార్ సైకిల్ పై నుండి కింద పడిపోయాడు. తీవ్ర గాయాల పాలైన గోపాల్ రెడ్డి ని చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్మి కంపోస్ట్ సేల్ కౌంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-చీడికాడ: మండలంలో జి కొత్తపల్లి సచివాలయం వద్ద వర్మి కంపోస్టు సెల్కౌంటర్ ను ఎంపీడీవో హేమ సుందర్ సోమవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపిఓ ఆదేశాలు మేరకు ఈ కౌంటర్ ను ప్రారంభించడం జరిగిందన్నారు గ్రామంలో తయారు చేసిన కంపోస్టును కౌంటర్ వద్ద 180 కిలోల కొంపోస్ట్ ఒక కిలో 10 రూపాయల చప్పున అమ్మకాలు జరిపామన్నారు ఇక్కడ పండించిన వివిధ రకాల కాయగూరలను సోమవారం అమ్మకం చేయడం జరిగిందని అయన తెలిపారు అన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖరరావు పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలం లోని నామవరం గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో పోషకాహార విలువలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, పప్పు దినుసులు, వ్యక్తిగత పరిశుభ్రత, తల్లిపాలు ప్రాముఖ్యత, తల్లిపాలు శిశువుకు ఇవ్వడం వల్ల తల్లికి బిడ్డకు ఏ రకంగా సంరక్షణ, ఆరోగ్యవంతమైన జీవన విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎం.నాగేశ్వరరావు, దడాల నెహ్రూ, భవాని, అంగన్వాడీ కార్యకర్తలు నాగఫణి, శ్యామల, కార్యకర్తలు ఆదిలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి పిఎసిఎస్ చైర్మన్ గా బాధ్యత చేపట్టిన కొప్పిశెట్టి బుజ్జి

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలో నక్కపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి చైర్మన్ గా కొప్పిశెట్టి వెంకటరమణ (బుజ్జి) సోమవారం బాధ్యత చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన పంట రుణాలను మంజూరు చేస్తామని రైతులకు ఎప్పటికప్పుడు అండగా నిలుస్తామని అన్నారు. ఈ మేరకు డైరెక్టర్లుగా కోసూరు శ్రీను మనబాల కొండ బాబు బాధ్యత చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ లాలం కాసినాయుడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు తదితరులు అభినందించారు.

మంత్రి మనోహర్‌కుదృష్టికి మండల సమస్యలు ..

విశాలాంధ్ర-వి.మాడుగుల: మాడుగుల మండలంలో గల సమస్యలను అధిష్టాన వర్గానికి తెలియజేస్తానని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం అల్లూరి జిల్లాను సందర్శించడానికి వెళుతూ మార్గమధ్యలో మాడుగుల మండలం ఘాట్ రోడ్ జంక్షన్ వద్ద జనసైనికులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా జనసైనికులు మండలంలో గల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సమస్యల పట్ల ఆయన సానుకూలంగా స్పందిస్తూ త్వరలో వాటిని పరిష్కరించే ప్రయత్నం అధిష్టాన వర్గంతో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గరెడ్డి శివాజీ, మండల ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు, సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్, బిజెపి నాయకులు మెలిపాక స్వామి, సుంకరి మణికంత పలువరు నాయకులు పాల్గొన్నారు.

నీరు లేక ఆకుమడులు వేసుకోలేని స్థితిలో రైతన్నలు...

- ఏపీ రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులు ఎస్.బ్రహ్మాజీ

విశాలాంధ్ర-మునగపాక: ఆకుమడులకు నీరు లేదు గాని నీటి తీరువా కట్టాలా..? అంటూ ఏపీ రైతు సంఘం మండల గౌరవాధ్యక్షులు యస్.బ్రహ్మాజీ ధ్వజమెత్తారు.స్థానిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం గిట్టుబాటు లేక వలస బాట పడుతున్న తరుణంలో నీటి పన్నులు ఏమిటని ఆయన ప్రశ్నించారు.గత కొద్ది రోజులుగా రెవిన్యూ అధికారులు రైతులకు నీటి పన్నులు కట్టాలని డిమాండ్లు చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.వర్షాభావ పరిస్థితులలో నీరు లేక ఆకుమడులు వేసుకోలేని పరిస్థితులు లో రైతులు డోలాయమానంలో ఉన్నారన్నారు.శారదా నది ద్వారా ప్రవహించే నీరు గోడారి ఆనకట్ట మరమ్మ తులు చేపట్టని కారణంగా నీరు వృధాగా పోయే పరిస్థితి ఉందన్నారు. రైవాడ నీరు ఇతర ప్లాంట్లకు తరలిపోవడంతో కనీసం నాలుగు మాసాలైనా రైతులకు నీరు పారే పరిస్థితి లేకపోవడం బాధాకరమన్నారు. రైతు బాంధవులం అని చెప్పుకునే ప్రభుత్వాలు ముందుగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వలసల ను నివారించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అయినా కూటమి ప్రభుత్వం నీటి తీరువా పన్నులను వెనక్కి తీసుకోవాలని,లేని పక్షంలో ఏపీ రైతుసంఘం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దాడి భాస్కరరావు,బిశెట్టి సన్యాసినాయుడు,పొలిమేర రాము, వేగి సూరిబాబు, దాడి నాయుడు తదితర రైతులు పాల్గొన్నారు. ..

యువత క్రీడల్లో ముందుండాలి

- రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-మునగపాక: యువత క్రీడల్లో ముందుండాలని రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు, పల్లా శ్రీనివాస రావు అన్నారు. మండలంలో నాగులాపల్లి గ్రామంలో యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆగస్టు18,19,20 తేదీలలో రాష్ట్రస్థాయి స్త్రీలు మరియు పురుషులు కబడ్డీ పోటీలకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఎమ్మెల్యే కప్ ను సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నా సోదరుడు నా సహచర ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జన్మదినం పురస్కరించుకొని నాగులపల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న రాష్ట్రస్థాయి స్త్రీ,పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల పట్ల యువతకి ఆసక్తి కలిగించడంతో పాటు వాళ్లలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసి తద్వారా వాళ్లకు క్రీడల ద్వారా రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తుకు తోడ్పాటు అందిస్తుందని అన్నారు.గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమం ద్వారా వేలాది రూపాయలు అక్రమంగా దోచుకుని గ్రామీణ క్రీడలను భ్రష్టు పట్టించారని ఎద్దేవా చేశారు.కానీ మన కూటమి ప్రభుత్వం గ్రామీణ యువతకు క్రీడల్లో మంచి అవకాశాలు ఏర్పడే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రీడలు ప్రోత్సహించడం ద్వారా శారీరక మానసికంగా దృఢంగా తయారు చేసి వాళ్లకు రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగడానికి అవసరమయ్యే అన్ని అవకాశాలను కల్పించడం ద్వారా క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పించడంలో ఈ ప్రభుత్వం ముందుంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కబాడీ కార్యనిర్వహణ కార్యదర్శి ఊరుకుటి శ్రీనివాసరావు,మండల టీడీపీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం,శరగడం యోగి నాగేశ్వరరావు,ఆడారి ఆనంద్ సన్యాసినాయుడు,పొలమరశెట్టి మురళి,ఆడారి గణేష్,ఆడారి జనార్దన్ రావు,పోలమరశెట్టి నాగు,జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వి.కోటేశ్వరరావు తదితరులు

పెనుగొల్లు పిఎసిఎస్ చైర్మన్ గా రెడ్డి పవన్ కుమార్ భాధ్యతలు

విశాలాంధ్ర-యస్ .రాయవరం : మండలంలో పెనుగొల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ చైర్మన్ గా జనసేన కు చెందిన రెడ్డి పవన్ కుమార్ భాధ్యతలు స్వీకరించారు .కూటమి ప్రభుత్వం ఈ పిఎసిఎస్ ను జనసేన కు కేటాయించడం తో పవన్ కుమార్ తో పాటు టిడిపి కి చెందిన చల్లపల్లి తాతబ్బాయి(దత్తుడు),దోసపాత్రుని నాగేశ్వరరావు లు డైరెక్టర్లు గా భాధ్యతలు స్వీకరించారు .ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పల్లెల బుజ్జి ,టిడిపి నాయకులు ప్రగడ తులసి నాయుడు ,పెద సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు .

ఆక్రమణకు పాల్పడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు...

అఖిలపక్ష నాయకుల ఫిర్యాదు

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: మండలంలో పెద్దమదిన గ్రామ రెవిన్యూ లో ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 81 లో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు మరియు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమణకు పాల్పడుతున్నారని పెద్దమదిన గ్రామానికి చెందిన అఖిలపక్ష నాయకులు కొల్లిమల్ల అచ్చంనాయుడు, చొప్ప బాబురావు, జోగా కొండబాబు, కొల్లి మల్ల వెంకట రావు ,సామాజిక కార్యకర్త వి. ఏ .నాయుడు యాదవ్ పి. జి .ఆర్ .ఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొల్లిమల్ల అచ్చం నాయుడు అమరావతి ఫోకస్ ప్రతినిధితో మాట్లాడుతూ పెద్దమదిన గ్రామ రెవిన్యూలో సర్వే నెంబర్ 81 లో సుమారు 158 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని అన్నారు. ఇందులో కొంత భూమి ఇతరులు సరివిడి తోటలు వేసుకొని లక్షల కోట్లు సంపాదించుకున్నారని ఆయన అన్నారు. గ్రామంలో ప్రజలు యువతి యువకులు ఐక్యతగా ఉండి ఈ వందల ఎకరాల భూమిని కాపాడుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. అలాగే పి జి ఆర్ ఎస్ లో ఈ వందల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడమని కలెక్టర్కు ఫిర్యాదు చేశామని అన్నారు. అలాగే న్యాయవాది చొప్ప బాబురావు మాట్లాడుతూ పెద్దమదిన గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను యువత ముందుకొచ్చి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వైయస్సార్సీపి నాయకులు జోగా కొండబాబు మాట్లాడుతూ గ్రామ ప్రజలు యువత ఐకమత్యంగా ఉండి ఈ కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొండబాబు అన్నారు. సామాజిక కార్యకర్త నాయుడు యాదవ్ మాట్లాడుతూ యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రం శెట్టి ఈశ్వరరావు, చొప్ప మరిడి బాబు, దాసరి పరదేశి నాయుడు, సొంటానా గోవిందు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను తక్షణమే నిలిపివేయాలి

సిపిఐ, సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర-నర్సీపట్నం: పట్టణంలో సోమవారం సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను తక్షణమే నిలిపివేయాలని, ప్రజలపై విద్యుత్ బారాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నర్సీపట్నం ఇండోర్ సబ్ స్టేషన్ ముందు నిరసన తెలియజేసి, పాల్గాట్ సెంటర్ నుంచి అభి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం ఆదానితో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని వ్యతిరేకించిన తెలుగుదేశం, అధికారంలోకి వచ్చిన తర్వాత కొనసాగించడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి అన్నారు. ఇప్పటికే విద్యుత్ రెగ్యులేటర్ కమిటీ అథారిటీ అనుమతితో 12 వేల కోట్లు రూపాయలు ని అదనంగా భారం మోపెందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. ఈ విద్యుత్ బారాలతో భవిష్యత్తులో సామాన్యులు బ్రతికే పరిస్థితి లేదన్నారు. చిన్నపాటి నివాస గృహాలకు చిన్నపాటి వ్యాపారస్తులకు వేల రూపాయల్లో బిల్లులు స్మార్ట్ మెటల్ బిగించిన తర్వాత వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మన రాష్ట్రంలో రైతులు ఉచిత విద్యుత్తు ,చిన్నపాటి పరిశ్రమలు కు,ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్లు సబ్సిడీ విద్యుత్తు ను పొందుతున్నారు. ఈ స్మార్ట్ మీటర్లను బిగిస్తే ఈ సబ్సిడీ సౌకర్యం ఉండదన్నారు. ఈ స్మార్ట్ మీటర్లు తో ప్రతి గంటకి రీడింగ్ తీసి, బిల్లు వేస్తారన్నారు. రోజులో అత్యధిక వాడికి టైం లో అదనంగా భారాల్లో మోపే అవకాశం ఉందన్నారు. చిన్నపాటి చిల్లర వర్తకులు విద్యాసంస్థలు ఇతర వాణిజ్య సముదాయాల్లో కూడా మనోదు సాధించలేని పరిస్థితి ఎదురవుతాదన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాము నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధాని కంపెనీ తో చేసుకున్న స్మార్ట్ మేటర్ ఒప్పందాన్ని విరమించుకోకపోతే మరో బషీర్బాగ్ విద్యుత్ ఉద్యమాన్ని కూటమి ప్రభుత్వం సవిచూడాల్సి వస్తుందన్నారు. ప్రజలు ఎక్కడికి అక్కడ స్మార్ట్ మేటర్ బిగించి దాన్ని వ్యతిరేకించి, మాట మీటర్ వ్యతిరేక పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, ఈ.చిరంజీవి, ఎల్ గౌరీ, కే వి సూర్య ప్రభ, సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జి గురు బాబు, కొత్తూరు జి పనేంద్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి బాబులు, గంగాభవాని, కె.లక్ష్మి, అంకం రెడ్డి చిన్ని నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయం వార్షికోత్సవం

విశాలాంధ్ర -సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి గ్రామం లో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి ఆలయం వార్షికోత్సవం ఆలయం కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పెందుర్తి నియోజక వర్గం వైస్సార్సీపీ నాయకులు గండి రవికుమార్ విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ భక్తి ప్రతీ ఒక్కరిలో మంచి మనసుతో ఉంటూ ప్రతీ ద్వేష భావజాలకు పోకుండా ఉంటే ఆ భగవంతుడే ప్రతీ ఒక్కరిలో తోడుగా ఉంటారని కొనియాడారు అలాగే ఆ దేవ దేవుడు శ్రీ శ్రీ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలు అందరు పై ఉండి అందరు సుఖ సంతోషాలుతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు యర్ల నాయుడు , సిరపరపు వాసు ,కరక రాము , గురి శ్రీనివాస్ , గోతిరెడ్డి అమ్మతల్లి , గండి రవికుమార్ యువ సైన్యం పాల్గొన్నారు.

అంగనవాడి కేంద్రాలలో తల్లిపాలు వారోత్సవాలు

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని సబ్బవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పెదగొల్లలపాలెం, బాటజంగాలపాలెం-1 అంగన్వాడి కేంద్రాలలో సోమవారం ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. బాటజంగాల పాలెం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల్లో గ్రామ సర్పంచ్ పడాల వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు పట్టించాలన్నారు. 6 నెలల వయస్సు వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తరువాత అదనపు ఆహారం ఇస్తూ రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్. హెచ్. పి శాంతి, ఏఎన్ఎం ఉమామహేశ్వరి, ఎన్. ఎస్. కె శశికళ, అంగన్వాడీ కార్యకర్త రమణమ్మ, తల్లులు పాల్గొన్నారు.

హీరో మోటార్ బైక్స్ షోరూం ప్రారంభించిన ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల

విశాలాంధ్ర -సబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం పంచాయితీ వాణిజ్య సముదాయం లో హీరో మోటార్ బైక్స్ షోరూం ను స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు హీరో మోటార్ బైక్స్, స్కూటీలు అందుబాటులోకి తీసుకురావడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు,లక్ష్మి ఎంటర్ ప్రైజస్ అధినేత చొక్కాకుల వెంకటరావు, బోకం శ్రీనివాసరావు , మండల జనసేన పార్టీ అధ్యక్షులు కర్రి కనకరాజు , సబ్బవరం మేజర్ పంచాయితీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, సబ్బవరం-2 ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు ,బోకం స్వామి నాయుడు , సింగంపల్లి శ్రీనివాసరావు , జెట్టి ప్రసాద్, పల్లా రమణ, మేడపాటి రాము,పల్లి మంగరాజు, కనుగుద్ది కనకరాజు,వాకాడ తేజ, కరణం పండు, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

లక్కవరం హైస్కూల్ స్కూల్ విద్యార్థులకు ఎన్.ఎం.ఎం.ఎస్ మెటీరియల్ వితరణ

విశాలాంధ్ర -చోడవరం : మండలం లోని లక్కవరం జిల్లా పరిషత్ హై స్కూల్ లో 8 వ తరగతి చదువుతున్న విధ్యార్థినీ, విద్యార్థులు కు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్.ఎం.ఎం.ఎస్. స్టడీ మెటీరియల్ ను సోమవారం పంపిణీ చేశారు. హై స్కూల్ ఇన్చార్జి హెచ్ఎం పద్మజ అధ్యక్షతన ట్రస్ట్ సభ్యులు జూరెడ్డి దివాకర్, ఉపాధ్యాయులు చేతులు మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఈర్లి రవి కుమార్, టి. సాయి హేమంత్, ఎం.వి.స్వామి ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు సమస్యలు పరిష్కరించాలని తాసిల్దార్ కి వినతి

విశాలాంధ్ర -గరివిడి: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలో విలేకరు లందరూ తాసిల్దార్ బంగార్రాజుకు వినతి పత్రం అందజేశారు. ఇంటి స్థల పట్టాలు మంజూరు చేయాలని భీమా సౌకర్యాలు కల్పించాలని ఫంక్షన్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్ ప్రతినిధులు సత్యనారాయణ, హరీష్, బాలాజీ, వరప్రసాద్, సూరిబాబు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్ట్ లకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర -శృంగవరపుకోట రూరల్ : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల జూనియర్ (బాలికలు), తాటిపూడి, విజయనగరం జిల్లా లో గల కళాశాలలో జువాలజీ సబ్జక్టును బోధించుటకు తాత్కాలిక ప్రాతి ప్రదికన మహిళా అధ్యపకులను నియమించుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారదాబాయి చౌదరి తెలిపారు. అభ్యర్థులు ఆ సబ్జెక్ట్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కనిగి 50% మార్కులను సాధించి ఉన్న మహిళ అధ్యపకులకు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 07-08-2025 సాయంత్రం గం 4:00 లోగా కళాశాలలు ఆఫీసుకు అందదేయవలెను. పూర్తి వివరములకు 8712625071 మొబైల్ నెంబర్ కి సంప్రదించవచ్చును.

బల్క్ డ్రగ్స్ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని గుర్రాజుపేట రైతులు నిరసన

విశాలాంధ్ర -యస్.రాయవరం :ఈ నెల 6తేదీన నక్కపల్లిలో జరిగే బల్క్ డ్రగ్స్ పార్క్ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని కోరుతూ మండలంలో గుర్రాజుపేట గ్రామంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. గుర్రాజుపేట గ్రామంలో ఎవరు భూములు ఇవ్వకపోయినా గుర్రాజుపేట గ్రామ పరిధిలోని బల్క్ డ్రగ్స్ పార్క్ ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు, పర్యావరణానికి, ప్రజలు అనారోగ్యాలకు నష్టం కలిగించే బాల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు కు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రజామోదం లేని, విదేశాల్లో నిషేధించిన బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయవద్దని ఆగష్టు ఆరొవ తేదీన జరపతలపెట్టిన ప్రజా భిప్రాయ సేకరణ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్,దాట్ల రామరాజు,వెంకపతిరాజు , మహాదేవ్, గోవింద్,రమణ, అప్పలరాజు, మంగ,బంగారమ్మ పాల్గొన్నారు.

క్లస్టర్ - 2 పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం 100% పూర్తి

విశాలాంధ్ర -యలమంచిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, నియోజవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు గొర్లి నానాజీ ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం యలమంచిలి పట్టణంలో క్లస్టర్ - 2 పరిధిలో 100% పూర్తి పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా క్లస్టర్ - 2 పరిధిలో క్లస్టర్లు బోద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, పట్టణ కమిటీ సభ్యులకు, యూనిట్ కన్వీనర్లకు, వార్డు అధ్యక్షులకు, బూత్ కన్వీనర్లకు, యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

జడ్పీటీసీ నిధుల నుండి అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో మల్ల వరం పంచాయతీ శివారు కుంచవానిపాలెం గ్రామంలో జడ్పీటీసీ నిధుల నుండి సీసీ డ్రైన్ 4 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,సర్పంచ్ ఇందల హేమలత, సింహాచలం నాయుడు, సాలాపు నర్సింగరావు,పంచాయతీ వార్డు మెంబర్లు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్వహణపై ఫిర్యాదు

విశాలాంధ్ర -యస్ .రాయవరం : మండలంలోని పెనుగొల్లు గ్రామంలోని రక్షణ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో కొంతమంది సభ్యులు ముఠాగా ఏర్పడి గోశాల నిర్వహణలో చాలా లోపాలు ఉన్నాయని సామాజిక కార్యకర్త సోమిరెడ్డి నూకరాజు ఫిర్యాదు చేశారు. గోశాల పేరుతో గోవులను పట్టుకొని పెనుగొల్లు సమీపంలో వద్ద ఏర్పాటుచేసిన గోశాల వద్ద గోవులను సక్రమంగా పరిరక్షించట్లేదని కొన్ని ఆవులను అక్రమ రవాణా చేస్తున్నట్లు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ నిర్వహణ చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు.

వృద్ధులకు రొట్టెలు, బియ్యం వితరణ

విశాలాంధ్ర-పూసపాటిరేగ : మండలంలోని సోమవారం శంభాన నరసమ్మ ఐదువ వర్ధంతి సందర్భంగా విజయనగరంలోని ప్రేమ సమాజం-వృద్ధాశ్రమానికి బియ్యంప్యాకెట్స్, అందరికీ సరిపడ రొట్టెలు, కొంతమంది అనాధలకు భోజనాలు విరాళంగా శంభాన నరసమ్మ, అప్పన్న వారి కుటుంబ సభ్యులందరూ సహాయం చేశారు ఈ మహెూన్నతమైన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ యువకులు , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొరుప్రోలు పిఎసిఎస్ కు ఉత్తమ పనితీరు అవార్డు

విశాలాంధ్ర -యస్ .రాయవరం : కొరుపలు ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం 2024- 25 కు ఉత్తమ పనితీరు అవార్డును ప్రకటించడం జరిగింది. అందులో భాగంగా విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెం నాయుడు చేతుల మీదుగా పిఎసిఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ, కార్యదర్శి వరప్రసాద్ లు అవార్డును అందుకున్నారు. బ్యాంక్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని చైర్మన్ రామకృష్ణ తెలిపారు.

జ్వరంతో ఐదేళ్ల బాలిక మృతి

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన 5 ఏళ్ళ బాలిక ధన్నాన జాస్మిన్ విష జ్వరం తో మృతి చెందినది.. విషయం తెలుసుకుని జిల్లా వైస్సార్ పార్టీ ప్రచారవిభాగం అధ్యక్షులు ,జడ్పీటీసీ ప్రతినిధి,వలిరెడ్డి శ్రీనివాసనాయుడు సోమవారం విశ్వనాథపురం గ్రామానికి వెళ్లి జాస్మిన్ కుటుంబ సభ్యులు ను పరామర్శించి, ఓదార్చారు.. అత్యంత టెక్నాలజీ తో కూడిన మెడికల్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ జ్వరం తో 5 సవత్సరాల బాలికను కోల్పోవడం చాలా బాధాకరం అని ఆయన అన్నారు, ఇది జ్వరాల సీజన్ అని, ప్రతి గ్రామంలో జ్వరాలు విజ్రంబి స్తున్నాయి అని, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు, గ్రామాల్లో ఏ ఎన్ ఎం లు , ఆశ వర్కర్ లు జ్వరాల తీవ్రతను బట్టి డాక్టర్ లకు ఎప్పటికి అప్పుడు సమాచారం ఇస్తూ జ్వరాల బారిన పడిన వారికీ మందులు, ఇంజక్షన్ లు ఇస్తూ ప్రజలకు అవసరమైన సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన అన్నారు.. గ్రామస్థాయిలో పరిస్థితి చేయి జారితే జ్వరం తీవ్రత ఎక్కువ గా వున్న వారిని చీపురుపల్లి ప్రభుత్వ హాస్పిటల్ కి పంపించి వైద్య అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అలాగే ఎంపీడీవో సురేష్ గారికి, ఆర్ డబ్ల్యు ఎస్ జేఈ రామకృష్ణ కి ఫోన్ చేసి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి కాలువలు క్లీనింగ్ చేయించి, బ్లీచింగ్ చల్లాలని, మంచి నీటి ట్యాంక్ క్లీన్ చేయించాలని, కుళాయిలు కాలువల దగ్గరలో వెళుతున్న పైప్ లైన్లో లీకులు ఉంటే వెంటనే గుర్తించి బాగుచేయాలనీ ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ ప్రతినిధి జిల్లా వైస్సార్ పార్టీ ప్రచారవిభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు రేవల్ల సత్తి బాబు, స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు కర్రోతు ప్రసాద్,రేవల్ల సత్యం, రవి, గణేష్, వెంకీ, శాంతకుమార్, నీల పాల్గొన్నారు.

పిబిఎల్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ కు యువత అభినందనలు

విశాలాంధ్ర-చోడవరం:నిరుద్యోగులు చిరుద్యోగులకు గ్రామస్తులకు సహాయ సహకారాలు అందిస్తూ ఉపాధి బాట వేస్తున్న పిబిఎల్ ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేష్ కు మైచర్లపాలెం లక్ష్మీపురం ఖండేపల్లి గ్రామాలకు చెందిన యువత అభినందనలు తెలియజేశారు. చోడవరంకు చెందిన రాజేష్ సుమారు 40 ఏళ్ల క్రితం ఉద్యోగం కోసం విశాఖపట్నం వెళ్లి వ్యాపారంలో ఉన్నత స్థాయిలో సెటిల్ అయి, వ తమ అమ్మ పేరున 'పూసర్ల భాగ్యవతి' పేరున 'పిబిఎల్ ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ తో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు బూరె కొండయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పి.బి.ఎల్ చేసిన సేవల్లో కండేపల్లి గ్రామంలో సుమారు మూడు లక్షల రూపాయలతో ఏడాది క్రితం లైబ్రరీని స్థాపించారన్నారు. ఇదే లైబ్రరీలో చదువుకున్న ఐదుగురు నిరుద్యోగులు పోలీస్ రిక్రూట్మెంట్ లో ఉద్యోగాలు పొందారని తెలియజేశారు. లక్ష్మీపురం గ్రామంలో సుమారు నాలుగు లక్షల రూపాయలతో నిరుద్యోగుల కోసం గ్రంథాలయమును ఏర్పాటు చేసారని తెలిపారు. ఇదే గ్రంథాలయంలో చదువుకున్న ఇద్దరు నిరుద్యోగులకు పోలీసు ఉద్యోగాలు పొందారని తెలిపారు. చోడవరం ప్రేమ సమాజానికి పిబిఎల్ రాజేష్ నాలుగు నెలల క్రితం ఏడు లక్షలు 50 వేల రూపాయలతో ఒక సోలార్ ప్యానల్ తో కూడిన పవర్ సప్లై ను ఇవ్వడం జరిగిందన్నారు. ఖండిపల్లి నుండి ఏ.పి.ఎస్.పి. సివిల్ కానిస్టేబుల్ గా ఎంపికైన వారిలో సివిల్ కానిస్టేబుల్ గా చప్పగడ్డి చంద్రరావు, కడిమి జనార్ధన్ లు, ఏ.పి.ఎస్.పి కానిస్టేబుల్ గా చప్ప గడ్డి గణేష్, వేపాడ రాజుబాబు లున్నారు. లక్ష్మీపురం నుండి ఎంపికైన వారిలో పెద్దాడ రాము (సివిల్ కానిస్టేబుల్), ఇల్లపు నూకరాజు (వైజాగ్ రూరల్ సివిల్ కానిస్టేబుల్) గా ఎంపికయినారు. రెండు గ్రామాల నిరుద్యోగ యువకులు మరియు రెండు గ్రామాల సర్పంచ్ లు భవాని గణపతి, రాజ శేఖర్ కలసి గ్రామాలలో లైబ్రరీ స్థాపించి ఎందరో నిరుద్యోగ యువకులకు ఉపాధి చూపే విధంగా విదంగా సహకరిస్తున్న పి బి ఎల్ ట్రాన్స్పోర్ట్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత కంటి పరీక్షల లబ్దిదారులకు కంటి అద్దాలు పంపిణీ

-గో హాస్పిటల్స్ హైదరాబాద్ వారి సహకారంతో

150 మందికి పైగా లబ్ధి

విశాలాంధ్ర-నర్సీపట్నం: గత నెల స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో గో హాస్పిటల్స్ హైదరాబాద్ వారు నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌లో భాగంగా కంటి పరీక్షలు చేయించుకున్న లబ్ధిదారులకు ఉచితంగా కళ్లజోడులు అందజేసే కార్యక్రమం సోమవారం నాడు నర్సీపట్నంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇంటి ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ కుమారుడు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ లబ్ధిదారులకు ఉచిత కళ్లజోడులను స్వయంగా అందజేశారు. విశాఖపట్నం శంకర్ ఐ హాస్పిటల్ మరియు గో హాస్పిటల్స్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 21 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు (ఆపరేషన్లు) కూడా నిర్వ హించడ మ య్యింది. అలాగే 150 మందికి పైగా లబ్ధిదారులకు కంటిచూపు అవసరానికి అనుగుణంగా రూ.1200 నుండి రూ.1500 విలువైన కళ్లజోడులను గో హాస్పిటల్స్ వారు ఉచితంగా అందించడం విశేషం. ఈ కార్యక్రమం ద్వారా ప్రజారోగ్యం పట్ల స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రాధాన్యత, వారికి ప్రజల సంక్షేమం పట్ల ఉన్న నిబద్ధత మరోసారి వెల్లడయినట్టు పలువురు లబ్ధిదారులు అభిప్రాయపడ్డారు ఉచిత కళ్ళజోడు అందజేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి, గో హాస్పిటల్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

తాండవ చక్కెర కర్మాగారం కార్మికుల బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర -పాయకరావుపేట: తాండవ చక్కర కర్మాగారం కార్మికుల బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పాయకరావుపేట వచ్చిన ఆయనకు జనసేన పార్టీ నాయకులు తోట నగేష్ ఆధ్వర్యంలో తాండవ చక్కెర కర్మాగారం యూనియన్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో తాండవ చక్కెర కర్మాగారం రైతులు, కార్మికులు బకాయిలు చెల్లింపులు కోసం తాను షుగర్ కేన్ కమీషనర్, మంత్రులతో మాట్లాడినట్లు తెలిపారు. రైతులు బకాయిలు చెల్లించారు కానీ, సుమారు రూ. 12 కోట్లు కార్మికుల బకాయిలు ఉండి పోయాయని తెలిపారు. ఈ విషయమై షుగర్ కేన్ కమిషనర్, సంబంధిత శాఖ మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొర్రెల రాజబాబు, విసిసి జనరల్ సెక్రెటరీ జగతా శ్రీనివాస్, కంభంపాటి వెంకట రమణ, జగతా శ్రీధర్, తలారి రాజా, ఇంజరపు సూరిబాబు, పెంకే శ్రీను, ముక్కుడుపల్లి నాగరాజు, వేముల వెంకటేశ్వరరావు, కర్మాగారం యూనియన్ నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, కర్రి శ్రీను, పక్కుర్తి కొండబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పు గల్లీలు పారిశ్రామిక వాడకు కేటాయిస్తే పూడిమడకకు ముప్పే

విశాలాంధ్ర-అచ్యుతాపురం : ఉప్పుగల్లీల భూములు పారిశ్రామిక వాడకు కేటాయిస్తే పూడిమడక గ్రామం వరదల ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని సర్పంచ్ , వార్డు మెంబర్లు అన్నారు . సోమవారం పూడిమడక పంచాయతీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సర్పంచ్ , వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు . పూడిమడక గ్రామానికి ఆనుకొని ఉన్న ఉప్పు గల్లీలు పారిశ్రామిక వాడకు కేటాయిస్తే పూడిమడక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని ఉప్పుటేరుపై ఆధారపడిన మత్స్యకారులు , కార్మికులు ఉపాధి కోల్పోతారన్నారు . అలాగే ఉప్పు గల్లీలో ఉన్న మడ అడవులు తీయడం వల్ల చేపలు సంతానోత్పత్తి తగ్గి మత్స్య సంపద ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందన్నారు . వరదలు వచ్చేటప్పుడు ఉప్పు గల్లీల భూములు రిజర్వాయర్ల వలె నీరు నిలవండి తరువాత ఆ నీరు సముద్రంలో చేరుతుందన్నారు . అదే పారిశ్రామిక వాడు కేటాయిస్తే పూడిమడక గ్రామం వరదలకు మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు . ప్రభుత్వం వారు గమనించి ఉప్పు గల్లీల భూములను పారిశ్రామిక వాడకు కేటాయించే ప్రతిపాదనను విరమించుకోవాలని పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు . ఈ సమావేశంలో సర్పంచ్ చేపల సుహాసిని వెంకటరమణ , వార్డు మెంబర్ పొన్నమల్ల కొండబాబు తదితరులు పాల్గొన్నారు .

పలు వార్డుల్లో బాబు షూరిటీ..మోసం గ్యారెంటీ

విశాలాంధ్ర-రాజాం: రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా.తలే రాజేష్, రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాస రావు డా. తలే రాజేష్ మాట్లాడుతూ చంద్రబాబును గెలిపించి రాష్ట్ర ప్రజలు ఓడిపోయారని.. ఇప్పుడిప్పుడే తామంతా మోసపోయామని బాధపడుతున్నారని స్పష్టం చేశారు. ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు ప్రతిసారి ఎన్నికల ముందు మాయ మాటలు... బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నికల్లో ఇచ్చిన నవరత్నాలను నూరు శాతం అమల పరిచారన్నారు. అదే చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను సంవత్సరం కాలం పూర్తయినా ఇప్పటివరకు ఒకటి రెండు తప్ప అమలపరిచిన దాఖలు లేవన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పెన్షన్లు కోత విధించి 4000 రూపాయలు పెన్షన్ ఇచ్చానని డబ్బాలు కొట్టుకుంటున్నారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చే పథకాలకు పేర్లు మార్చి అమ్మ ఒడికి బదులు తల్లికి వందనం, రైతు భరోసా ఒక పేరు అన్నదాత సుఖీభవ లాంటి పథకాలతో ప్రజలను మోసం చేసి పథకాలను సక్రమంగా అందించలేని ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు నాయుడు అని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏ ప్రాంతానికి వెళ్ళినా వేలాదిమంది జనాభా వస్తున్నారని వారి అనుకూలమైన పత్రిక ఆంధ్రజ్యోతిలోనే ముద్రించారని తెలిపారు.అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం బూటకపు హామీలుమోసాలను ప్రజలకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పబ్లిసిటీ విభాగం అధ్యక్షులు ఆశపు సూర్యం, ఎంప్లాయిస్ & పెన్షనర్ల విభాగం అధ్యక్షులు పాలవలస శ్యామ్ సుందర్ రావు, జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షులు డా.బి.నరేంద్ర, మహిళా నాయకురాలు అల్లెన జయలక్ష్మి, మున్సిపల్ విభాగం అధ్యక్షులు శాసపు వేణు నాయుడు, ఆర్ టి ఐ విభాగం అధ్యక్షులు వంజరాపు విజయ్ కుమార్, పిట్టా జగదీష్, గోకలవలస బాబు రావు, గార సత్యనారాయణ,భవానీ శంకర్, సీక ప్రసాద్, బోనెల రాజేష్, గుండాల తేజ, సీక గణేష్, సాయి శివ, జంగం చంటి, మొగడ రవి, సీక చిన్న మరియు రాజాం టౌన్ వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పోస్ట్ బాక్స్ మాయం...

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : విశాలాంధ్ర దిన పత్రికలో ప్రచురితమైన కథనాలకు సంబంధించి, తంతి తపాలా శాఖ అధికారులు ఇటీవలే ఒక పోస్ట్ బాక్సు స్థానంలో కొత్త బాక్స్ పెట్టకుండా ఉన్న బాక్స్ మాయం చేసినట్టు తెలిసింది. ఈ సంఘటనతో, తంతి తపాలా శాఖలో అధికారులు చేస్తున్న ఆగడాలు మరోసారి బయటపడ్డాయి. గత నాలుగు నెలలుగా ఓపెన్ చెయ్యని పోస్ట్ బాక్స్ అనే అంశం పై, విశాలాంధ్ర పత్రికలో వచ్చిన కథనాలను బట్టి పోస్ట్ బాక్సును గమనిస్తున్నట్టు పోస్టాఫీస్ ఉద్యోగులు మెలకువగా ఉన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలనే బదులు, వార్తాపత్రికల్లో వచ్చిన విమర్శలకు ప్రతిస్పందనగా ఈ అధికారులు పోస్ట్ బాక్సే అదృశ్యం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. చాలామంది ప్రజలు, ముఖ్యంగా నగదు చెల్లించి పోస్టాఫీసుకు వెళ్లలేని వ్యక్తులు, పోస్ట్ బాక్స్ ద్వారా ఉత్తరాలు, పార్సళ్లు పంపుతుంటారు. ఈ సదుపాయం లేకపోతే, సామాన్య ప్రజలకు ఇబ్బంది ఎదురవుతుంది. ఈ సంఘటనపై తంతి తపాలా శాఖ యొక్క ఉన్నతాధికారులు తక్షణం విచారణ చేసి, ఈ చర్యకు కారణమైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, పోస్ట్ బాక్సును తిరిగి స్థాపించి, ప్రజల సౌకర్యాన్ని నిర్ధారించాలని కోరుకుంటున్నారు. ప్రజా సేవలో నిమగ్నమైన శాఖలు విమర్శలకు భయపడి ప్రజా సదుపాయాలను తొలగించడం సముచితం కాదు. ఈ సంఘటనపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.